

అద్భుత నిర్మాణం.. ఆధ్యాత్మిక వైభవం
విద్యాధరి సన్నిధిలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శ్రీ కంచి శంకరమఠం రూపుదిద్దుకున్నది. రూ.3 కోట్ల వ్యయంతో ఎకరం విస్తీర్ణంలో సర్వాంగసుందరంగా నిర్మితమైంది. 8లో



పాతకక్షల నెపంతో దాడి
పాత కక్షల నెపంతో ఒకరిపై ముగ్గురు దాడి చేశారు. బాధితుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబసభ్యుల ఆందోళనతో ఉద్రిక్తత నెలకొంది. 8లో



మొక్కలు నాటి.. సంరక్షణ మరిచి
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమంలో రోడ్లకు ఇరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు మండల వ్యాప్తంగా నీరులేక ఎండిపోతున్నాయి. 9లో..

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్



సీపీ ఎన్.శ్వేత

సిద్దిపేటకమాన్: గ్రూప్ 1 ప్రిలిమినరీ రాత పరీక్ష జరగనున్న కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన పట్టణంలోని 20 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్ 1 ప్రిలిమినరీ రాత పరీక్ష జరుగనున్నందున ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లు, లౌడ్ స్పీకర్లు మూసివేసి ఉంచాలని తెలిపారు. పరీక్షా కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండకూడదని పేర్కొన్నారు. పరీక్షా రాసే అభ్యర్థులు బ్యాగులు, సెల్‌ఫోన్‌లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలికులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తమ వెంట తీసుకరావద్దని, వాటిని లోనికి అనుమతించరని ఆమె తెలిపారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి



బడిబాటలో అధికారులు, ప్రజాప్రతినిధులు

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలని చేర్పించి బడులను బలోపేతం చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి పి రంగనాథ్ స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని తీగలగుంటపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరుగుతు ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తడకల రాజిరెడ్డి, సర్పంచ్ మ్యాక చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

మర్కూక్(గజ్వేల్): ఫర్టిలైజర్ డీలర్లు నిబంధనలు పాటించాలని లేనిచో చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని గణేశ్‌పల్లి గ్రామంలో ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు దుణాకాల్లో స్టాక్ బోర్డును తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులను విక్రయించాలని, నకిలీవి విక్రయిస్తే కేసులు పెట్టడంతో పాటు డీలర్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదులను తీసుకొని భద్ర పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పద్మ, ఎఓ నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లోని శ్రీనివాస్ రైతు కేంద్రాన్ని, ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కోర్‌టెక్ కంపెనీకి చెందిన స్టాలిన్ పత్తి రకాన్ని హెచ్‌టి కాటన్ కొరకు పరీక్షించారు. ఆ పత్తి విత్తనాల్లో హెచ్‌టి లేదని నిర్ధారించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటఅర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థ మెదక్ ఈస్ట్ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. 2023 మార్చిలో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వెబ్ సైట్‌లో రూ.100 రుసుం చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హైకోర్టు ఆదేశాలు పాటించకపోవడం దారుణం

కొండపాక(గజ్వేల్): ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకంపై హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం పాటించడంలేదని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ ఆరోపించారు. లకుడారం గ్రామంలో తుమ్మ శ్రీనివాస్, మైస రాములుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మూడేళ్లుగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం చేయకపోడం దారుణమన్నారు.

చెరువు మట్టి.. సేంద్రియ ఎరువే

- తరలింపునకు అధికారుల అడ్డంకులు
- రైతులకు అనుమతి ఇవ్వాలని డిమాండ్
- చెరువు పూడికతీత మరిచిన ఉపాధి హామీ అధికారులు



తోటపల్లిలో రైతు భూమిలో పోసిన చెరువు మట్టి

హుస్నాబాద్‌రూరల్: వ్యవసాయ పంటల దిగుబడులకు రైతులు విచ్చల విడిగా రసాయన ఎరువులు వాడడం వలన భూసారం దెబ్బతింటుంది. భూసారం పెంచడం కోసం రైతులు ప్రతీ ఏటా ఎకరాకు 20 నుంచి 25 ట్రిప్పుల చెరువు మట్టిని పోసుకుంటే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. చెరువు పూడిక వండ్రు మట్టిని రైతుల సాగు భూములకు తరలించడం ద్వారా భూసారంను పెంచడంతో పాటు నేలకు సత్వను అందిస్తుంది. చెరువు మట్టిలో 70శాతం ఒండ్రు 30 శాతం బంక మట్టి ఉండటంతో పంటలకు ఉపయోగపడే నత్రజని భాస్వరం, పొటాష్‌తో పాటు సూక్ష్మపోషకాలు, పోషకాలు సమృద్ధిగా ఉండటం వల్ల భూసారం పెరుగుతుంది. సిద్దిపేట జిల్లాలో గత ఏడాది 1020 చెరువుల్లో పూడిక తీయుటకు జాతీయ ఉపాధిహామీ పథకంలో అధికారులు పనులు మంజూరు చేయగా ఇప్పుడు చెరువు పూడికతీత పనులు లేకపోవడంతో రైతులు యంత్రాల సహాయం తీసుకుంటున్నారు.

- చెరువు పూడిక తీసే పనులను అధికారులు ఉపాధిహామీ పథకంలో పెట్టకపోవడంతో రైతులు యంత్రాల సహాయంతో తీసుకొని మట్టిని తరలించుకుంటున్నారు.
- మట్టి రవాణాకు యంత్రాలను ఉపయోగించడంతో రెవెన్యూ అధికారులు అనుమతులు లేవని అడ్డకుంలు చెబుతున్నారు.
- వానకాలం రోహిణి కార్తె గడిచింది, మృగశిర కార్తెలో ముసురు వానలు పడితే మట్టి రవాణా కష్టమవుతుందని అధికారులు స్పందించి రైతులకు అనుమతులు ఇవ్వాలని కోరుతున్నారు.
- గౌరవెల్లి ప్రాజెక్టు నీళ్లు చెరువులకు వస్తే ఒండ్రు మట్టి దొరకదని ఇప్పుడు అధికారులు మట్టి రవాణాకు అవకాశం ఇస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.
- చెరువు పూడిక తీయడం వల్ల చెరువులో వర్షపు నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు ఉపయోగపడంతో పాటు చెరువుల్లో పెరుకపోయిన చెట్లను తొలగించే అవకాశం కలుగుతుంది.
- పూడిక మట్టి తీయడం వల్ల కూలీలకు పని దొరకడంతో పాటు రైతులకు మట్టి తరలింపునకు ఆర్థిక భారం తగ్గుతుంది.
- ప్రతీ ఏటా వేసవి కాలంలో చెరువు పూడిక మట్టిని రైతుల పొలాలకు తరలించడం ద్వారా భూసారాన్ని పెంచుకొనే సదవకాశం రైతుకు వస్తుంది.
- మొక్కలకు కావల్సిన నత్రజని, పొటాష్, జింక్, మెగ్నిషీయం లాంటి పోషకాలు వండ్రు మట్టిలో లభించడం వల్ల పంటలు సాగు చేసే రైతులకు రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది.
- నత్రజని మొక్క పెరుగుదలకు ఉపయోగపడితే, పొటాష్ పంటలకు సోకే తెగుళ్లను తట్టుకునే శక్తిని ఇవ్వడం ద్వారా సెలక భూములకు చెరువు మట్టి సేంద్రియ ఎరువులాగా పని చేస్తుంది.
- రైతులు వ్యవసాయ భూముల్లో చెరువు మట్టి పోయడంతో రసాయన ఎరువుల భారం తగ్గుతుంది.
- గతంలో జాతీయ ఉపాధిహామీ పథకంలో రైతుల పొలాలకు మట్టి తరలించుటకు సన్న, చిన్నకారు రైతులకు ట్రాక్టరు కిరాయి ఒక్కొక్క రైతుకు ట్రిప్పుకు రూ.160లు చెల్లించేది. ఇప్పుడు ఆ అవకాశం రైతులకు లేదు.
- రైతుల భూముల్లో పోసిన మట్టిని కూలీల చేతనే ఎత్తించే అవకాశం జాబ్‌కార్డు కలిగిన రైతులకు ఉంది.
- వ్యవసాయ భూములను అభివృద్ధి చేసుకునేందుకు ఉపాధిహామీ పథకం రైతులకు వరంగా మారినా అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు శాపమైంది.
- అధికారులు స్పందించి చెరువు నుంచి మట్టి తీసుకునే రైతులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

భూసారం పెరుగుతుంది



చెరువు నల్ల మట్టిని సాగు భూమిలో పోసుకుంటే భూసారం పెరుగుతుంది. పునాస పంటలు వేసుకుంటే దుబ్బా నేలలకు నీళ్ల తడులు తొందరగా ఆరిపోకుండా తడిని నల్ల మట్టి ఆపుతుంది. నల్ల మట్టితో నాలుగు రోజులు భూమిలో తేమ ఉంటే మక్క కర్రలకు ప్రాణం ఉంటుంది. చేనుకు నాలుగు రోజులు నీళ్ల తడి ఆలస్యమైన చేను వల్లిపోకుండా తేమతోనే ఉంటుంది. ఇప్పుడు ఎవుసం పనులు లేవు. నా భూమిలో 50 ట్రిప్పులు పోసిన. ఉపాధిహామీ పనులు ఉంటే కూలీల భారం తగ్గుతుంది.

–మాదారపు రాంగోపాల్‌రావు, రైతు, గాంధీనగర్

చెరువు మట్టి పంటలకు పోషకాలు



వేసవి కాలంలో చెరువులోని ఒండ్రు మట్టిని పంట పొలాలకు తరలించడం వల్ల భూసారం పెరుగుతుంది. పంటలకు కావల్సిన పోషకాలు అందులో లభిస్తాయి. అందులో ఎక్కువ సూక్ష్మజీవులు ఉండటం వలన తెగుళ్ల నివారించే శక్తి ఉంటుంది. నత్రజని, పొటాష్, మెగ్నీషియం లాంటివి చెరువు పూడిక మట్టిలో లభిస్తాయి. ఇవి సాగు నేలలో వేసి కలియ దున్నడం వల్ల మొక్కల ఎదుగుదలకు పని చేస్తాయి. రైతులకు రసాయన ఎరువులు భారం తగ్గిస్తాయి. చౌడు నేలలో పోయడం వల్ల పంటల దిగుబడులు పెరుగుతాయి.

–పి.మహేశ్, డివిజనల్ వ్యవసాయ అధికారి, హుస్నాబాద్

అనుమతులు తీసుకోవాలి

రైతులు చెరువు నుంచి మట్టి తీసుకోవాలంటే మాకు ఎలాంటి అభ్యతరం లేదు. ఇటుక బట్టీలకు పోతుందని ఫిర్యాదులు రావడం వలన మేం చర్యలు తీసుకుంటున్నాం. చెరువు మట్టి కావల్సిన రైతులు వారి పట్టా పాసు పుస్తకాలు తీసుకొని ట్రాక్టర్ నంబర్లు ఇస్తే అనుమతులు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తాము.

–గయాస్ ఉన్నీసా బేగం, తహసీల్దారు, హుస్నాబాద్

15న ఐటీ హబ్ ప్రారంభం

పనులను పరిశీలించిన మంత్రి హరీశ్‌రావు



ప్రారంభ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటఅర్బన్: అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఐటీ హబ్‌ను ఈ నెల 15న ఐటీ, పురపాలక శాఖ మంత్రి తారకరామారావు ప్రారంభించనున్నారని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సిద్దిపేటలో నిర్మిస్తున్న ఐటీ హబ్‌ను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌లతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రారంభ ఏర్పాట్లపై టీఎస్ఐఐసీ అధికారులతో సమీక్ష జరిపారు. సిద్దిపేట యువతకు స్థానికంగా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సిద్దిపేటలో ఐటీ హబ్ ఏర్పాటు చేశారన్నారు. ఐటీ హబ్‌లో ప్రత్యక్షంగా 750 మంది స్థానిక యువతకు ఉపాధి లభించనుందని, పరోక్షంగా మరి కొంత మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఐటీ హబ్‌లో టాస్క్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కు నిరంతర శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మాధవి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మెడికల్ బోర్డు సభ్యుడు పాల సాయిరాం, ఐటీ హబ్ ఇన్‌చార్జి చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉండదానికే జిమ్‌లు

కోహెదరూరల్ (హుస్నాబాద్): ఆరోగ్యంగా ఉండడానికే జిమ్‌లు దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ గ్రామంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో రూ.8లక్షల నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ రోజారాధకృష్ణ శర్మ, ఎంపీపీ కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ నాగరాజు శ్యామల, సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య, మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్ పాల్గొన్నారు.

ఉత్సవాల పేరుతో మభ్యపెడుతున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్

గజ్వేల్‌రూరల్: ప్రజలు, రైతులు సమస్యలతో గోస పడుతుంటే తెలంగాణ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో మభ్య పెడుతుందని టీజేఎస్(తెలంగాణ జనసమితి) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ పేర్కొన్నారు. టీజేఎస్ జిల్లా అధ్యక్షుడిగా గజ్వేల్ పట్టణానికి చెందిన నీరుడి స్వామిని నియమించిన సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల హరితా రెస్టారెంట్ వద్ద శుక్రవారం దళిత సంఘాల నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోదండరామ్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సిన రాజకీయ నాయకులు దళారులుగా మారారని, అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ తెలంగాణలో బీఆర్ఎస్ విధానాల వల్ల రాజకీయాల్లో మానవీయ కోణం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోతున్నారని, దళితబంధు పథకంలో అవినీతి సాకుతో రెండేళ్లుగా నిలిపివేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు మైస రాములు, డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, సీసీసీ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్, టీజేఎస్ నాయకులు స్వామి తదితరులు పాల్గొన్నారు.

సొమ్ము తెలంగాణది.. సోకు బీజేపీది



హుస్నాబాద్ సంక్షేమ సంబరాల్లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటలో గొర్రెలను పంపిణీ చేస్తున్న మంత్రి తన్నీరు హరీశ్ రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందేమిలేదని, తెలంగాణ డబ్బులతో మెడికల్ కళాశాలలు నిర్మిస్తే, అవి కేంద్రం నిర్మించినవేనని బీజేపీ గ్లోబల్ ప్రచారం చేస్తుందని, సొమ్ము తెలంగాణది..సోకు బీజేపీదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సంక్షేమ దినోత్సవంలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా 60 మంది వివిధ చేతి వృత్తిదారుల(బీసీల)కు లక్ష రూపాయల చొప్పున ప్రొసిడింగ్ అందజేశారు. గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 30 మందికి 21 గొర్రెలను అందించారు. 27 మంది వీధి వ్యాపారులకు రూ.30, రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకంలో భాగంగా రూ.20 లక్షల రూపాయల ప్రొసిడింగ్‌లను అందించారు. లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఎనిమిది మందికి రూ.30వేల నుంచి లక్ష రూపాయల మ్యారేజ్, యాక్సిడెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించిన ప్రొసిడింగ్ అందించారు. సెట్విన్ ద్వారా శిక్షణ పొందిన 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కులాంతర వివాహం చేసుకున్న మూడు జంటలకు రూ.2.5లక్షలను అందించారు. 5 మంది రైతులకు లక్ష రూపాయాల విలువ గల పంపుసెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో సీటు కోసం ఎమ్మెల్యే రికమండేషన్‌కి వెళ్లేంత స్థాయికి, విద్యారంగాన్ని అభి వృద్ధి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, రాష్ట్ర మెడికల్ బోర్డు మెంబర్ పాల సాయిరాం, వివిధ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

త్వరలో గౌరవెల్లి ప్రారంభం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈ ప్రాంత రైతుల చిరకాల కల నెరవేరబోతుందని, త్వరలో సీఎం కేసీఆర్ చేత గౌరవెల్లి రిజర్వాయర్‌ను ప్రారంభిస్తామని రాష్ట్ర ఆర్థిక, వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి రిజర్వాయర్‌ను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. కట్ట పనులను పరిశీలించారు. అక్కడికక్కడే ఇరిగేషన్ ఇంజనీర్లతో సమీక్షించి మిగులు పనులు వారంలోపే పూర్తయ్యేలా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే భూ నిర్వాసితులకు పరిహారం అందించే ప్రక్రియ పూర్తయ్యిందని, అలాగే 10కిలో మీటర్ల మేర కట్ట నిర్మాణ పనులు పూర్తి కావొచ్చిందన్నారు.

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డుకునేందుకు కౌరవులుగా వచ్చిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా పూర్తి చేసుకున్నామని, మహాభారతంలోలాగా ధర్మం నిలబడి, న్యాయం గెలిచిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో పాల్గొని రూ.15కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయితే ఎక్కడ కేసీఆర్‌ను, ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను యాజ్ఞిసుకుంటారేమోనని కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డంకులు సృష్టించారన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్, అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట

సిద్దిపేటజోన్: దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు చెప్పారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో 30 మంది దివ్యాంగులకు ట్రై స్కూటీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగులకు రూ.1,04,000ల విలువైన ట్రై స్కూటీలను అందిస్తున్నదని తెలిపారు. త్వరలోనే వికలాంగులకు సొంత ఖర్చులతో ఉచిత బస్సు పాసులు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్స్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి స్వర్ణయుగం

సాక్షి, సిద్దిపేట: సీఎం కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం అని, ప్రతీ ఏడాది పేదల సంక్షేమానికి రూ.50వేల కోట్లు ఖర్చుపెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అత్తాకోడళ్ల పంచాయితీలు బందయ్యాయన్నారు.

నిబంధనలకు అనుగుణంగా ప్రిలిమ్స్ పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఈ నెల 11న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్న క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా టీఎస్‌పీఎస్సీ నిబంధనలకు అనుగుణంగా పరీక్షను నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, పోలీస్ కమిషనర్ శ్వేతాతో సమావేశం నిర్వహించి పరీక్ష నిర్వహణపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంలో 20 పరీక్ష కేంద్రాలలో 7786 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, ప్రతీ ఒక్క అభ్యర్థి ప్రశాంతంగా పరీక్ష రాసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ వెంట ఎట్టి పరిస్థితుల్లో కూడా మొబైల్ ఫోన్, వాచ్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరాదన్నారు. కేవలం చీఫ్ సూపరింటిండెంట్లు, లైజనింగ్ ఆఫీసర్లకు మాత్రమే ఫోన్లను అనుమతించాలన్నారు. పరీక్ష ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకూ ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 8 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి పూర్తిగా తనిఖీ చేసి అనుమతించాలన్నారు.

బ్యాంకింగ్ రంగంలో ప్రథమ స్థానంలో నిలపాలి



బ్యాంకింగ్ రంగంలో అత్యుత్తమ సేవలు అందించిన జిల్లాను రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలపాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్9 గదిలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు లీడ్‌బ్యాంకును ఆర్‌బీఐ గత 2016లో కేటాయించిందని, అప్పటి నుంచి నేటివరకు అన్ని బ్యాంకులతో కలిసి ప్రభుత్వానికి, ప్రజలకు సేవలు అందిస్తుందన్నారు. ఇకపై ప్రభుత్వానికి, ప్రజలకు మరింతగా సేవలు అందజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. లీడ్ బ్యాంక్ ద్వారా అన్ని బ్రాంచుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా చేయాలన్నారు. అనంతరం లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ మాట్లాడారు.

క్లుప్తంగా

ఏడుపాయల్లో గుర్తు తెలియని చిన్నారి



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో గుర్తు తెలియని చిన్నారి కనిపించింది. దుర్గమ్మ ఆలయం సమీపాన శుక్రవారం ఏడాదిన్నర వయస్సున్న బాలిక ఏడుస్తుండగా, అక్కడ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ వెంకటేశ్ పాపను అక్కున చేర్చుకొని స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్‌ఐ విజయ్ మెదక్ బాలసదన్ వారికి చెప్పగా, వారు ఏడుపాయలకు వచ్చి పాపను తీసుకెళ్లారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 8500055633 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

కార్లు ధ్వంసం

సంగారెడ్డి టౌన్: గుర్తు తెలియని వ్యక్తులు కార్లను ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని కులబ్గూరు గ్రామంలో చోటు చేసుకుంది. సంగారెడ్డి రూరల్ పోలీసుతెలిపిన వివరాలు ప్రకారం గురువారం రాత్రి ఇళ్ల ముందు పెట్టిన మూడు కార్లను ధ్వంసం చేశారని కాలనీవాసులు షౌకత్ అలీ, నరసింహగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం లారీ సీజ్

మునిపల్లి(అందోల్): హైదరాబాద్ నుంచి గుజరాత్‌కు లారీలో బియ్యం తరలిస్తుండగా, కంకోల్ టోల్‌ప్లాజా సమీపంలో సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారని బుదేరా ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం లారీలో 291 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా, పట్టుకున్నాయని, లారీడ్రైవర్, బియ్యం తీసుకెళుతున్నవారిపై కేసు నమోదు చేశారు.

సోలార్ బ్యాటరీ చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): సోలార్ బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. శివ్వంపేటకు చెందిన రైతు నీరుడి చంద్రయ్య తూప్రాన్ - నర్సాపూర్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పొలం వద్ద పంట రక్షణకు సోలార్ కంచె ఏర్పాటు చేశాడు. మూడు రోజుల క్రితం ఊరెళ్లి వచ్చానని శుక్రవారం పొలం వద్ద చూస్తే బ్యాటరీ చోరీ అయ్యిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు.

16న ఖేలో ఇండియా సైక్లింగ్ ఎంపికలు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఖేలో ఇండియా సిద్దిపేట జిల్లా సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం ఏడు గంటలకు సైక్లింగ్ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ, క్రీడా శాఖ అధికారి నాగేందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 12 నుంచి 16 సంవత్సరాల మధ్య ఉన్న బాలబాలికలకు సైక్లింగ్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అదనపు విధులు నిర్వర్తించడం అభినందనీయం



మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ సిబ్బంది విలేజ్ బస్సు ఆఫీసర్స్‌గా అదనపు విధులు నిర్వర్తించడం అభినందనీయమని ఎంవీఐ జనార్దన్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట ఆర్టీసీ డిపోలో చేపట్టిన విలేజ్ బస్సు ఆఫీసర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డితో కలిసి ఎంవీఐ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీఐ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విలేజ్ బస్సు ఆఫీసర్స్‌కు సంస్థ అందించిన కిట్లను ఎంవీఐ అందజేశారు. అనంతరం డీఎం సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు సిద్దిపేట, దుబ్బాక డిపోలలో విలేజ్ బస్సు అధికారులను నియమించామన్నారు.

అద్భుత నిర్మాణం.. ఆధ్యాత్మిక వైభవం

- వర్గల్ విద్యాధరి సిగలో మరోనగ
- సర్వాంగ సుందరంగా శ్రీ కంచి శంకరమఠం
- 11న ప్రారంభించనున్న కంచి పీఠాధిపతి



వర్గల్ క్షేత్రంలో నిర్మితమైన శ్రీ కంచి శంకరమఠం

వర్గల్(గజ్వేల్): తెలంగాణలో రెండో బాసరగా విలసిల్లుతున్న వర్గల్ శ్రీవిద్యాసరస్వతీక్షేత్రం సిగలో మరోనగ చేరింది. విద్యాధరి సన్నిధిలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శ్రీ కంచి శంకరమఠం రూపుదిద్దుకున్నది. రూ.3 కోట్ల వ్యయంతో ఎకరం విస్తీర్ణంలో సర్వాంగసుందరంగా నిర్మితమైంది. ఈ నెల 11న జగద్గురువులు కంచికామకోటి సర్వజ్ఞ పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతీస్వామి భవన ప్రారంభోత్సవం చేయనుండగా, మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరవుతున్నారు.

- హైదరాబాద్ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో సిద్దిపేట జిల్లా వర్గల్ శంభునిగిరి శిఖరాన శ్రీవిద్యాసరస్వతీ మాత కొలువుదీరింది.
- 1989లో శిలాన్యాసం, 1992లో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. నాటి నుంచి తన చెంత చేరిన భక్తులను అమ్మవారు కటాక్షిస్తూ దినదిన ప్రవర్ధమానమై విరాజిల్లుతున్నది.
- క్షేత్రంలో శనీశ్వర, శ్రీలక్ష్మీగణపతి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర, శ్రీకల్యాణ వేంకటేశ్వరాలయాలు కొలువుదీరాయి. వేద పాఠశాల, భోజన మహాప్రసాదం క్షేత్రానికి ప్రత్యేకతగా నిలుస్తున్నాయి. ఇక్కడ శ్రీశారదాచంద్రమౌళీశ్వరాలయం నిర్మాణ దశలో ఉన్నది.
- 1999లో ఈ వర్గల్ క్షేత్రం కంచి పీఠానికి అనుసంధానమైంది. 2014లో సీఎం కేసీఆర్ క్షేత్రాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.
- శ్రీ కంచి శంకరమఠం కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామి ఆదేశాలతో వర్గల్ క్షేత్రంలో మరో ఆధ్యాత్మిక కేంద్రానికి బీజం పడింది.
- కొండమీద కాకుండా భూమి మీద శ్రీకంచి శంకరమఠం నిర్మించాలని స్వామివారి సూచన మేరకు దాతల సహకారంతో కొండ పక్కనే దక్షిణదిశలో మూడెకరాల భూమి కొనుగోలు చేశారు.
- రూ.3 కోట్ల వ్యయంతో సకలహంగులతో శ్రీకంచి శంకరమఠం నిర్మాణానికి ఆగస్టు 13న శిలాన్యాసం జరిగింది.
- న్యూఢిల్లీకి చెందిన కేఈఐ (కృష్ణాఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్) అధినేత అనీల్‌గుప్త కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద శంకరమఠం నిర్మాణానికి అవసరమైన నిధులుఅందజేశారు. దీంతో అంతే వేగంగా భవన సముదాయ నిర్మాణపనులు శరవేగంగా పూర్తయ్యాయి.
- రెండు తెలుగు రాష్ట్రాలలో వర్గల్ శ్రీకంచి శంకరమఠం ఐకాన్‌గా నిలిచేలా 9000 చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన సముదాయం రూపుదిద్దుకున్నది.
- స్వామివారి కోసం ఏసీతో కూడిన ప్రత్యేక గది, చంద్రమౌళీశ్వర వేదిక, సభామండపం, ధ్యాన మందిరం, సువాసిని పూజ కోసం హాల్, వీఐపీ హాల్, స్నానశాలలు, టాయిలెట్ బ్లాకులు తదితర గదులు ఉండేలా భవనాన్ని తీర్చిదిద్దారు.

- ఇదే సముదాయంలో నిరంతర వేదఘోష ప్రతిధ్వనించేలా శ్రీశారదావైదిక స్మార్త విద్యాలయానికి గదులు కేటాయించారు.
- భవనం ముందర గ్రీన్‌గ్రాస్‌తో లాన్, పచ్చదనం పరిఢవిల్లేలా చుట్టూరా మొక్కలు నాటారు. చుట్టూరా ప్రహరీ నిర్మించారు. గోడలపై ఆధ్యాత్మికత ఉట్టిపడేలా విగ్రహాలు ఏర్పాటు చేశారు.
- 11న శ్రీ కంచికామకోటి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతీ స్వామివారు వర్గల్ సందర్శించి శ్రీకంచి శంకరమఠం, శ్రీశారదా వైదిక స్మార్త విద్యాలయం ప్రారంభిస్తారని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి తెలిపారు.

లోన్ పేరిట టోకరా

సిద్దిపేటకమాన్: లోన్ కోసం ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో వెతికి సైబర్ మోసగాళ్ల బారిన పడ్డారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపిన వివరాల ప్రకారం..గౌరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఇండియా బుల్స్ లోన్ కోసం ఆన్‌లైన్‌లో కస్టమర్ కేర్ వివరాలు వెతుకుతూ అందులో ఉన్న నంబరుకు ఫోన్ చేశాడు. దీంతో ఆ ఫోన్ మాట్లాడిన గుర్తు తెలియని వ్యక్తి లోన్ మంజూరవుతుందని, ముందుగా ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత మొత్తం చెల్లించాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు ఆన్‌లైన్‌లో రూ.25,175 పంపించాడు. తర్వాత ఆ నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. తను మోసపోయినట్లుగా గుర్తించిజాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు ఫిర్యాదు చేశాడు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ..

దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒకరికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని నమ్మించాడు. క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని మొబైల్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు చెప్పాలన్నాడు. దీంతో ఆ మాటలు నమ్మిన బాధితుడు తన సెల్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు తెలియజేశాడు. వెంటనే తన ఖాతా నుంచి రూ.16,500 డెబిట్ అయినట్టు అతని సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. బాధితుడు వెంటనే సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కంగారులో సెల్‌ఫోన్ వదిలివెళ్లిన దొంగలు



పటాన్‌చెరు టౌన్: వస్తువులను చిందరవందరగా పడేసిన దృశ్యం



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం...పట్టణంలోని సాయిరాంకాలనీకి చెందిన కమల్‌ఉద్దీన్ శాంతినగర్‌కాలనీలో ఉండే తల్లిదండ్రుల వద్దకు గురువారం ఉదయం వెళ్లాడు. తిరిగి అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి రాగా అప్పటికే ఇంట్లో ఉన్న ఇద్దరు దొంగలు ఇది గమనించి అక్కడి నుంచి పరారయ్యారు. అయితే దొంగతనానికి వచ్చిన దొంగ తన సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టుకుని మరి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంటి యజమాని దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యారు. దొంగలు చార్జింగ్ పెట్టిన సెల్ వదిలేసివెళ్లారు. బాధితుడు ఇంట్లోకి వెళ్లి చూడగా 12 తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.24 వేల నగదు దొంగలించినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు క్లూస్‌టీం బృందంతో కలిసి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటకమాన్: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో కేబుల్ ఆపరేటర్ బాలరాజు నివాసముంటున్నాడు. బుధవారం కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో బొడ్రాయి పండగకు తన చెల్లెలి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం బాలరాజు ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. గమనించిన స్థానికులు బాధితునికి సమాచారం చేరవేశారు. వెంటనే బాలరాజు తన ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని సామగ్రి చిందర వందరగా పడి ఉన్నాయి. 12 తులాల బంగారు ఆభరణాలు, 25తులాల వెండి, రూ.2లక్షల నగదు చోరీకి గురైనట్టు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పలువురి గాయపడ్డారు.

ఆటో బోల్తా పడి...

జోగిపేట(అందోల్): ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందాడు. ఎస్‌ఐ సామ్యానాయక్ కథనం ప్రకారం...కృష్ణ, శేఖర్, మొగులయ్య(45)తో పాటు మరో ఇద్దరు కలిసి శుక్రవారం మద్యం సేవించారు. తాలెల్మ నుంచి డాకూరు వెళుతుండగా వీరు ప్రయాణిస్తున్న మార్గమధ్యలో అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో మొగులయ్య తలకు వెనకభాగాన బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలో మిగతావారు గాయపడ్డారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ ఢీకొని..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. సదాశివపేట సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని మద్దికుంట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మీకాంత్ రెడ్డి(32) ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గురువారం సెకండ్ షిఫ్ట్‌లో భాగంగా పరిశ్రమలో విధులు నిర్వర్తించి రాత్రి తన స్కూటీపై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో మద్దికుంట చౌరస్తా వద్ద గ్రామానికి వెళ్లేందుకు రోడ్డును క్రాస్ చేస్తుండగా రాంగ్‌రూటులో వస్తున్న లారీ డ్రైవర్ తనవాహనాన్ని అతి వేగంగా,అజాగ్రత్తగా నడుపుతూ స్కూటీని బలంగా ఢీ కొట్టాడు. దీంతో లక్ష్మీకాంత్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు..

కొముురవెల్లి(సిద్దిపేట): కారు అదుపుతప్పి మహిళను ఢీకొనడంతో మహిళకు గాయాలైన ఘటన మండలంలోని కిష్టంపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌరాయపల్లి నుంచి చేర్యాలకు వెళ్లే దారిలో గ్రామ శివారులోని ఇటుక బట్టీల వద్ద ఇటుక బట్టీల్లో పని చేసే కూలీలు రోడ్డు పక్కన గల చెట్టుకింద కూర్చొని ఉన్నారు. అదే సమయంలో గౌరాయపల్లి నుంచి చేర్యాలకు వెళ్తున్న టీ.ఎస్.08 ఎఫ్.టీ 1212 నంబర్ గల కారు ఒక్కసారిగా అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి అక్కడే కూర్చున్న కూలీపై దూసుకొచ్చింది. ప్రమాదంలో తురక నాగమణి అనే మహిళ తీవ్రంగా గాయపడిందని వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ చంద్రమోహన్‌ను వివరణ కోరగా ఇంతవరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఇద్దరికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన సురేందర్‌తోపాటు రాజ్‌పేట గ్రామానికి చెందిన మరోవ్యక్తి బైక్‌పై శివ్వంపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో తూప్రాన్- నర్సాపూర్ హైవేపై శివ్వంపేట గ్రామ శివారులో శుక్రవారం ట్రాలీఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాంగ్ రూట్‌లో వచ్చి...

అల్లాదుర్గం(మెదక్): ఆర్టీసీ బస్సును ట్రాక్టర్ ఢీకొన్నది. అయితే ఈ ఘటనలో ప్రయాణికులకు ఏ ప్రమాదం జరగలేదు. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..రేగోడ్ వైపు నుంచి సంగారెడ్డి వెళుతున్న ఆర్టీసీ బస్సును గడిపెద్దాపూర్ శివారులో టైర్ పంక్చర్ చేయించడానికి ట్రాక్టర్ రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. జోగిపేట వైపు వెళుతున్న అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఘటనాస్థలి వద్ద వివరాలు తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. పలువురికి గాయాలు

క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఇదే దారిగుండా వెళ్తున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆస్పత్రికి తరలించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఇదే దారిగుండా వెళ్తున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకొని అక్కడికి చేరుకున్నారు. కారులో ఉన్న క్షతగాత్రులను బయటకు తీసి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లను చేపట్టారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సింలు(ఫైల్)

వర్గల్(గజ్వేల్): విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. బేగంపేట ఎస్‌ఐ అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని దండుపల్లికి చెందిన రైతు టెంకంపేట నర్సింలు(55)కు భార్య సరవ్వ, కుమారులు రాజు, వెంకటేశ్, గణేశ్, ఇద్దరు కూతుళ్లు ఉండగా, వారి వివాహాలు జరిగాయి. తల్లి హనుమవ్వ కొడుకు వద్దే ఉంటోంది. గురువారం తన తల్లి మినహా కుటుంబసభ్యులందరూ సమీప గ్రామమైన ఎల్కంటిలో బోనాల పండగ ఉందని బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం పొలం వద్దకు వెళ్లొస్తానని తల్లికి చెప్పి రైతు నర్సింలు ఇంటి నుంచి బయల్దేరాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ తీగపడి సపోర్ట్‌వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతున్నట్టు ఆయన గమనించలేదు. బోరు నడవడం లేదనే ధ్యాసలో స్టార్టర్‌ను పరిశీలించి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సపోర్ట్ వైరును తాకడంతో ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

చీకటిపడినా తండ్రి ఇంటికి రాలేదని..

పొలానికి వెళ్లిన నర్సింలు రాత్రి చీకటిపడినా ఇంటికి రాలేదని నానమ్మ చెప్పడంతో కొడుకు వెంకటేశ్ తండ్రికి ఫోన్ చేస్తూ పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ తండ్రి కరెంట్‌షాక్‌తో విగతజీవిగా పడి ఉండడంతో బోరుమన్నాడు. ఊహించని ఈ విషాద ఘటనతో భార్య, పిల్లలు గుండెలవిసేలా విలపించారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబీకులను ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల సాయమందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

వేర్వేరు ఘటనల్లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు మృతి చెందారు.

తోపులాటలో తలకు గాయాలై...



తలారి రాములు (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..మండల పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన తలారి రాములుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య వెళ్లి పోవడంతో రాజమ్మను రెండవ వివాహం చేసుకున్నాడు. పెద్ద భార్యకు ఇద్దరు కుమారులు కాగా, వారు వేరుగా ఉంటారు. రాములు రాజమ్మతో కలిసి ఉంటుండగా, వారికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే తరచు దంపతుల మధ్య గొడవలు జరిగేవి. ఈ నెల 6వ తేదీన రాములు మద్యం మత్తులో భార్య రాజమ్మతో గొడవపడ్డాడు. ఈ సమయంలో జరిగిన తోపులాటలో రాములు కిందపడగా, తలకు తీవ్రగాయాలయ్యాయి. సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ రాములు గురువారం మృతి చెందాడు. రాములు పెద్దభార్య కొడుకు మచ్చేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వడదెబ్బతో ఆస్పత్రిలో చేరి



అజీమొద్దీన్(ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): కేంద్రం కొల్చారం గ్రామానికి చెందిన మహమ్మద్ అజీమొద్దీన్(56) కొంతకాలంగా మతిస్థిమితంతో బాధపడుతున్నాడు. నాలుగు రోజుల క్రితం ఎండ తీవ్రత కారణంగా అస్వస్థతకు గురి కావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అజీమొద్దీన్ గురువారం రాత్రి మృతి చెందాడని, మృతుడి సోదరుడు అప్సర్ తెలిపారు.

భార్య లేదన్న మనస్తాపంతో...



సిద్దిరాములు (ఫైల్)

టేక్మాల్(మెదక్): ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కోరంపలి గ్రామానికి చెందిన ఎల్లంపల్లి సిద్దిరాములు (27)కు మూడేళ్ల క్రితం శిల్పతో వివాహమైంది. వీరు తరచుగొడవ పడేవారు. ఈనెల 3వ తేదిన ఇద్దరూ గొడవ పడగా శిల్ప ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీంతో మనస్తాపానికి లోనై సిద్దిరాములు ఈనెల 7న గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

భర్త కట్నం వేధింపులు భరించలేక భార్య, తండ్రి మందలించాడని కొడుకు వేర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు.

కట్నం వేధింపులు తాళలేక..



సరిత (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: కట్నం వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం.. అందోల్ మండలం జోగిపేటకు చెందిన సరిత(33) వివాహం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన మకం కోటేశ్వర్‌తో తొమ్మిదేళ్ల క్రితం జరిగింది. పెళ్లి సమయంలో కట్నం కింద 27 తులాల బంగారం, 5 లక్షల నగదు ఇచ్చారు. మూడేళ్ల వరకు కాపురం సజావుగానే సాగింది. ఇద్దరు కూతుళ్లు జన్మించాక, అదనపు వరకట్నం వేధింపులు మొదలయ్యాయి. ఈనెల 8వ తేదీన సరిత తన సోదరి కవితకు ఫోన్ చేసి తన భర్త తిడుతూ, కొడుతున్నాడని వాపోయింది. భర్త వేధింపులు భరించలేకపోయిన సరిత గురువారం సాయంత్రం ఇంట్లో యాసిడ్ తాగింది. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు పటాన్‌చెరులో ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్టు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సరిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అల్లుడి వేధింపుల కారణంగానే తన కూతురు చనిపోయిందని మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని...



కరుణాకర్ (ఫైల్)

తూప్రాన్: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ సురేశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన జింక యాదగిరి పెద్ద కుమారుడు కరుణాకర్ (23)ను సోమవారం సాయంత్రం వ్యవసాయ పనుల విషయంలో మందలించాడు. మనస్తాపం చెందిన కొడుకు బోరుబావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వెంటనే గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించిందని వైద్యులు తెలిపారు. ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

పాతకక్షల నెపంతో దాడి

- చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి
- అంబులెన్స్‌లో మృతదేహం ఉంచి ఆందోళన

చిన్నశంకరంపేట(మెదక్): పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ముగ్గురు దాడి చేశారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నశంకరంపేట పోలీసుల కథనం ప్రకారం.. మండలపరిధిలోని సూరారం గ్రామానికి చెందిన బక్కన యాదగిరి(58) మే 21న రాత్రి కల్లాల వద్ద ధాన్యం కుప్పపై టార్పాలిన్ చుట్టాడు. టార్పాలిన్ లేవకుండా ఉండేందుకు బండ రాయిని తన పొలంలోంచి తీసుకొచ్చాడని అదే గ్రామానికి చెందిన బండ్ల సురేష్‌తోపాటు దిడ్డికింది మహిపాల్, కిషన్‌లు యాదగిరిపై దాడిచేశారు. దీంతో గాయపడిన యాదగిరిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. యాదగిరికి భార్య మంజుల, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

గ్రామంలో ఉద్రిక్తత

యాదగిరి మరణవార్త తెలియగానే గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పంచాయతీ వద్దకు చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారి నుంచి పరిహారం అందించేలా చూడాలని గ్రామపెద్దలను డిమాండ్ చేశారు. కాగా దాడికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నిందితుల కుటుంసభ్యులను పిలిపించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. గాంధీ నుంచి అంబులెన్స్‌లో వచ్చిన యాదగిరి మృతదేహాన్ని వాళ్ల ఇంటి వద్ద ఉంచి ఆందోళన చేస్తామన్నారు. ఈ క్రమంలోనే పోలీసులకు బాధిత కుటుంబసభ్యులకు వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు నచ్చజెప్పినా వినలేదు. అంబులెన్స్‌లోనే రాత్రి పొద్దుపోయేరకు మృతదేహాన్ని ఆందోళన చేస్తూనే ఉన్నారు.



అంబులెన్స్ నుంచి శవం తీయవద్దని అడ్డుకున్న బంధువులు

భారీగా పోలీసుల మోహరింపు



యాదగిరి (ఫైల్)

గ్రామంలో ఉద్రిక్తత నెలకొనడంతో భారీ సంఖ్యలో పోలీసులను మోహరింపజేశారు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నశంకరంపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట ఎస్‌ఐలు సుభాష్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, నర్సింహులు, రంజిత్, శ్రీనివాస్‌రెడ్డి, మహిళా ఎస్‌ఐ లక్ష్మి బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

సంక్షేమ పథకాల్లో తెలంగాణ నంబర్‌వన్



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: సంక్షేమ పథకాల్లో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక పట్టణంలోని రజనీకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన తెలంగాణ సంక్షేమ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్టీ కార్పొరేషన్ 15 మంది, ఎస్సీ కార్పొరేషన్ నుంచి 50 మంది, బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందిన ముగ్గురికి ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నాయన్నారు. తెలంగాణ ఆవిర్భవించిన 9 ఏళ్లలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం చాలా గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతకిషన్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.